## అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు



మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్ రూరల్, జనవరి 18: గ్రామ పంచాయతీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం కిష్టంపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో 2024-25కు సంబంధించిన యాక్షన్ ప్లాన్, చేపట్టబోయే అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ దివాకర్ పాల్గొన్నారు.

## కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి, జనవరి 18 : ఈ నెల 29న గడలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని డోంగుర్‌గాంలోగల నాగేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించే పూజా మహోత్సవాల కరపత్రాలను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గడలపల్లి సర్పంచ్ మడావి గుణవంతరావ్ గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోయం కట్టి, నిర్వాహకులు సిడాం శేఖర్, వేలాది రాజు, వేలాది మారుతి, సిడాం బాలు పాల్గొన్నారు.

# అడవుల్లో బతుకే పోరాటం



పులిదాడిలో మృతి చెందిన రైతు సిడాం భీం(ఫైల్)

## పులుల సంఖ్య పెరగడంతో ఆదివాసుల అవస్థలు

- పశువులపై పెరుగుతున్న దాడులతో అయోమయం
- అడవిని వదల్లేక.. ఎంత కష్టమొచ్చినా భరిస్తూ..
- ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడితే మంచిది..



ఇటీవల మృతిచెందిన పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు (ఫైల్)



పులిదాడిలో మృతిచెందిన పశువు వద్ద రైతు(ఫైల్)

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ), జనవరి 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో నిశబ్ద బతుకుపోరాటం సాగుతున్నది. పుట్టింది మొదలు గిట్టే వరకూ అడవి తల్లినే నమ్ముకుని హాయిగా బతుకుతున్న ఆదివాసులు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ కారిడార్‌లో పదేళ్లుగా పులుల సంతతి బాగా పెరిగింది. ఒకప్పుడు ఒకటీ రెండు పులులు మహారాష్ట్ర, ఇంద్రావతి, ప్రాణహిత, తడోబా నుంచి మన అడవుల్లోకి వచ్చి వెళ్లేవి. కానీ.. ఇటీవల కాగజ్‌నగర్ ఫారెస్ట్ పులుల ఆవాసంగా మారింది. ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్నాయి. ఈ క్రమంలోనే గడిచిన మూడేళ్లలో ఆదివాసులు, పశువులపై పులుల దాడులు పెరిగాయి. ముగ్గురు ఆదివాసులు చనిపోగా.. వందలాది పశువులు పులుల ఆకలికి బలైపోయాయి. ప్రపంచానికి దూరంగా అడవుల్లో ఉంటున్న ఆదివాసులు.. ఇప్పుడు బతుకు పోరాటం చేయాల్సి వస్తున్నది. అధికారుల నిర్లక్ష్యం, ఆదివాసులు అంటే చిన్నచూపుతో పులులపై దాడులు చేసే వరకు వెళ్లిందనడంలో సందేహం లేదు. తాజాగా కాగజ్‌నగర్ డివిజన్‌లో విషప్రయోగం చేసి పులులను హతమార్చడం ఉదాహరణగా నిలుస్తున్నది.

### ప్రతి దాడులకు కారణం అదేనా..

పులి దాడిలో మనుషులు చనిపోతే రూ.5 లక్షలు.. పశువులు(ఆవులు, ఎడ్లు) చనిపోతే రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టపరిహారం చెల్లించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పులులు చనిపోతే స్పందిస్తున్న జాతీయస్థాయి స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధికారులు.. అదే పులుల దాడుల్లో ఆదివాసులు, పశువులు చనిపోయినప్పుడు పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాల్సిన అధికారులు ఇబ్బందులకు గురిచేసినపుడు ఆదివాసుల్లో నైరాశ్యం పెరిగి పులులపై ప్రతి దాడి చేసే వరకు వెళ్తున్నారు. రెండు పులుల మృతి వెనుక ఉన్న కారణం ఇదే కావడం గమనార్హం. పశువును పులి చంపిందన్న కోపంతో విషప్రయోగం చేసినట్లు నిందితులు విచారణలో చెప్పడం కలకలం రేపింది. కానీ.. అధికారులు ఎప్పటి మాదిరిగానే ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.

### ఇవీ ఘటనలు.. అధికారుల దగ్గర లేని లెక్కలు..

- అడవుల్లో పెరిగిన పులుల సంతతితో ఆదివాసుల జీవనం కష్టంగా మారింది. మేత కోసం అడవులకు వెళ్లిన పశువుల మీద పులులు దాడులు చేసిన సంఘటనలు కోకొల్లుగా ఉన్నాయి. వారంలో కనీసం రెండు పశువులు మృతి చెందుతున్నాయి.
- నవంబర్ 11, 2020న దహెగాం మండలంలోని దిగిడ గ్రామానికి చెందిన విఘ్నేష్‌పై పులి దాడి చేసి చంపింది.
- నవంబర్ 29, 2020న పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన నిర్మలపై పులి దాడి చేసి పొట్టన పెట్టుకున్నది.
- 2022 నవంబర్‌లోనూ ఒక రైతును పులి బలిగొంది.
- 2024 జనవరిలో కూడా పశువుల మందతోపాటు పశువుల కాపరిపైనా పులి దాడి చేసింది. అదృష్టవశాత్తు ఆయనకు ఏం కాలేదు.
- 2021 సంవత్సరంలోనే దాదాపు 122 పశువులు చనిపోయాయి.
- గడిచిన నాలుగేళ్లలో పులి దాడిలో చనిపోయిన, గాయపడిన పశువుల సంఖ్య వందల్లోనే ఉంటుంది. కానీ.. ఆ వివరాలు అధికారుల దగ్గర లేకపోవడం గమనార్హం.
- ఇప్పటి వరకు 70 నుంచి 80 పశువులకు మాత్రమే రూ.12 లక్షల నష్ట పరిహారం అందించారు. ముగ్గురు చనిపోగా వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షలు ఇచ్చారు.
- పులుల దాడుల్లో చనిపోయిన మేకలు, గొర్రెలకు పరిహారం ఇవ్వడం లేదు.
- అదే పక్కనున్న మహారాష్ట్రలో పులుల దాడుల్లో మనుషులు చనిపోతే రూ.15 లక్షల పరిహారం ఇస్తున్నారు.

### ఏం చేస్తే బాగుంటుంది..

- అడవుల్లో పులులతోపాటు ఆదివాసుల రక్షణకు కూడా సమప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- పులులు ఆహారంగా తీసుకునే వన్యప్రాణుల సంతతిని పెంచాలి. గడ్డి మైదానాలను కూడా అభివృద్ధి చేయాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫలితంగా పాడి పశువులపై దాడి చేయకుండా ఉంటాయి.
- నిర్మల్ జిల్లాలోని జన్నారం మండల పరిధిలో గల అడవుల్లోని గూడేలు, తండాలు, గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి ప్రత్యామ్నాయ చర్యలను కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్ డివిజన్‌లలో కనిపించడం లేదు.
- అధికారులు తీరు మార్చుకోకపోతే పులుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.
- ఆదివాసులు కూడా పులులు దాడి చేసినప్పుడు క్షణికావేశానికి గురికాకుండా, న్యాయమైన పద్ధతిలో పరిహారం కోసం సంప్రదించాలని సూచిస్తున్నారు.
- త్వరలో మహారాష్ట్ర అటవీశాఖ అధికారులతో సమావేశమై పులుల రక్షణకు అక్కడ తీసుకుంటున్న చర్యలు, మనం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు అధికారులు చెప్తున్నారు. అవి ఎంత వరకు కార్యరూపం దాలుస్తాయనేది వేచిచూడాలి.

## బాధ్యతాయుతంగా పనిచేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వేమనపల్లి, జనవరి 18 : అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం వేమనపల్లిలోని గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులతో స్నేహంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. తహసీల్దార్, మండల పరిషత్ అధికారులు ప్రభుత్వ పథకాల అమలు, దరఖాస్తుల ప్రక్రియపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట మండల తహసీల్దార్ సదానందం, ఎంపీవో బాపు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్




పోస్టర్లు విడుదల చేస్తున్న డీసీపీ, డీటీవో

మంచిర్యాల ఏసీసీ, జనవరి 18 : రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు -2024 బ్యానర్లు, గోడప్రతులు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14వ వరకు జిల్లాలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడుపవద్దని సూచించారు. ఆటోలు, జీపులు ఇతర ప్రైవేట్ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని పేర్కొన్నారు. రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# శరవేగంగా జీపీ భవనాలు

### కేసీఆర్ సర్కారులో 21 పంచాయతీలకు నిధులు

- ఒక్కోచోట రూ.20 లక్షలతో నిర్మాణం
- అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు
- త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం
- తొలగిపోనున్న ఇబ్బందులు



కోటపల్లిలో ప్రారంభానికి సిద్ధమవుతున్న గ్రామపంచాయతీ భవనం

కోటపల్లి, జనవరి 16 : కేసీఆర్ సర్కారులో మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో కార్యాలయ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ. 20 లక్షల చొప్పున విడుదల చేశారు. ఇందులో కోటపల్లి, సర్వాయిపేట, వెలమపల్లిలో జీపీ భవనాలు ఇప్పటికే పూర్తి కాగా, నక్కలపల్లి, బొప్పారం, సిర్సా, పుల్లగామ, సూపాక, లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీల్లో నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇక అన్నారం, బబ్బెరచెల్క, దేవులవాడ, ఏదుల్లబంధం, రొయ్యలపల్లి, లింగన్నపేట్, నాగంపేట్, పారుపల్లి, వెంచపల్లి, ఎసన్వాయి, మల్లంపేట, ఎడగట్ట గ్రామాల్లో చిన్న చిన్న కారణాలతో నిర్మాణాలు నిలిచిపోగా, వీటిని కూడా తిరిగి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### తీరనున్న తిప్పలు

గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలతో పాలన మరింత సౌకర్యవంతంకానున్నది. ఇప్పటి వరకు గ్రామపంచాయతీలకు కార్యాలయాలు లేకపోవడంతో పాఠశాలలు, అద్దె భవనాల్లో పాలన సాగుతున్నది. సరైన సౌకర్యాలు లేక సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కింద, పాఠశాలల ఆవరణలో సమావేశాలు, గ్రామ సభలు నిర్వహించాల్సి వస్తుంది. ప్రస్తుతం ఒక్కో భవనాన్ని రూ. 20 లక్షలతో అత్యాధునికంగా నిర్మిస్తుండగా, తిప్పలు తప్పనున్నాయి. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు వేర్వేరు గదులు, రికార్డులను భద్ర పరిచేందుకు మరో గదిని నిర్మిస్తున్నారు. మరో వైపు సమావేశ మందిరం, మరుగుదొడ్ల నిర్మాణం కూడా చేపడుతున్నారు.

#### త్వరలో అందుబాటులోకి..



ఇన్నాళ్లు మా గ్రామ పంచాయతీకి పక్కా భవనం లేదు. దీంతో పాఠశాలలోనే కార్యాలయం నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం వేగంగా సాగుతుంది. త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అది ప్రారంభమైతే మా ఇబ్బందులు తొలగిపోతాయి.

\- రాగం రాజక్క, సర్పంచ్, కోటపల్లి

#### ప్రారంభానికి ఏర్పాట్లు..



మా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తయినట్లే. త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇన్నాళ్లు పక్కా భవనం లేక తీవ్ర ఇబ్బందులుపడాల్సి వచ్చింది. ఇక కొత్త భవనంలోకి మారితే ఎలాంటి సమస్యా ఉండదు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఇబ్బందులుండవు.

\- పసునూటి వసంత కుమారి, సర్వాయిపేట సర్పంచ్

#### సకల సౌకర్యాలతో..



మా ఊరిలో కొత్తగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం సాగుతుంది. సకల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మా ఊరి పాఠశాలలో గ్రామ పంచాయతీ భవనం కొనసాగుతుంది. ఎటూ సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొత్త భవనం అందుబాటులోకి వస్తే తిప్పలు తప్పినట్లే.

\- తోట స్రవంతి, నక్కలపల్లి సర్పంచ్

## కప్లై గుహల్లో భీమదేవునికి పూజలు

కెరమెరి, జనవరి 18 : ఆదివాసీల పుణ్యక్షేత్రమైన కప్లై గుహల్లో ఆదివాసీలు బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూర్(యు) మండలం శెట్టిహడ్పునూర్ ముగ్లెకర్(సిర్పూర్‌కర్) ఆత్రం వంశీయుల భీమదేవత ముగ్లెభలి, భొజ్జ భలి దేవతలకు పుణ్యస్నానాలు ఆచరించడానికి కప్లైకు కాలినడకన తరలివచ్చారు. భీమల్‌పేన్, దర్వాజ మసేమాలకు పూజలు చేసిన అనంతరం కటోడాల సాయంతో అత్యంత లోతైన గుహలోకి వెళ్లారు. పవిత్ర జలంతో దేవతలకు పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం పైకి వచ్చి తడి బట్టలతో దేవతలకు సామూహిక పూజలు చేశారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు పాటలు పాడుతూ నృత్యం చేశారు. రాత్రి అక్కడే బస చేసి గురువారం తిరుగుపయనమయ్యారు.



గుహ ప్రాంగణంలో సామూహిక పూజలు చేస్తున్న ఆదివాసులు

## హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

- డీఎంహెచ్‌వో డా.సుబ్బారాయుడు



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాల ఏసీసీ, జనవరి 18 : హెచ్‌ఐవీ (ఎయిడ్స్), సుఖ వ్యాధుల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జీ.సీ.సుబ్బారాయుడు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కూరగాయల మార్కెట్, బస్టాండ్ వద్ద జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శనను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుఖ వ్యాధులున్న వారికి హెచ్‌ఐవీ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలు, పీహెచ్‌సీల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని, వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో వెంకటేశ్వర్లు, జిల్లా సూపర్ వైజర్ వీ.అనిల్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెప్రాడకు మహా పాదయాత్ర



పాదయాత్రగా బయల్దేరుతున్న భక్తులు

బెజ్జూర్, జనవరి 18 : మండలంలోని ఎల్కపల్లి అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మహారాష్ట్రలోని చెప్రాడ దత్తావతార్ కార్తీక స్వామి మందిరానికి మహా పాదయాత్ర గురువారం బయలు దేరింది. ఎల్కపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు బెజ్జూర్ మండల కేంద్రంలోని రంగనాయకుల ఆలయ ప్రాంగణానికి చేరుకొని దైవ దర్శనాలు చేసుకున్నారు. అక్కడి నుంచి కుకుడ, పోతపల్లి, బారెగూడ, తదితర గ్రామాల మీదుగా యాత్ర సాగించారు. సాయంత్రం కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని పడవలపై దాటి చెప్రాడకు చేరుకున్నారు. బెజ్జూర్ గ్రామ పొలిమేర వద్ద జడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీటీసీ ఫర్వీన్ సుల్తానా భక్తులకు అరటి పండ్లు అందజేశారు. కుకుడలో హనీ ఎంటర్ ప్రైజెస్ యజమానీ నామని రాజలింగు భక్తులకు అరటి పండ్లు అందజేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో పాటు మరి కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు భక్తులకు భోజన వసతి కల్పించారు. రాత్రి ఆయా గ్రామాలకు చెందిన భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పల్లకీసేవా, బాబా సమాధి వద్ద పూజలు చేసి తిరిగి వస్తారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

## అయోధ్య రామ మందిర కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న వేదపండితులు

మంచిర్యాల ఏసీసీ, జనవరి 18 : ఈ నెల 22న అయోధ్య రాముడి మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి ఆలయంలో గోడ, కరపత్రాలను శ్రీరామ శోభాయాత్ర సభ్యుల సమక్షంలో వేద పండితులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న పట్టణంలో మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించబోయే భవ్య శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐబీ చౌరస్తా (హనుమాన్ చౌరస్తా), ఓవర్ బ్రిడ్జ్, లక్ష్మీనారాయణ మందిర్, విశ్వనాథ ఆలయం, మార్కెట్ చౌరస్తా మీదుగా బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్ వరకు ఈ శోభాయాత్ర సాగుతుందన్నారు. పలు ఆలయాల ఆధ్వర్యంలో తయారుచేసినటువంటి మహా ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ఇంట్లో దీపాలు వెలిగించాలని, అక్షింతలను దేవుని వద్ద ఉంచి ఆపై కుటుంబ సభ్యులపై చల్లాలని సూచించారు. భక్తులు వారి ఇంటి మీద శ్రీరాముని జెండా ఎగురవేయాలని కోరారు. మంచిర్యాల పట్టణంలోని వివిధ దేవాలయాల అర్చకులు, శ్రీరామ భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.